క్లుప్తంగా...

ఈవెనింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని ఎంబీఏ కాలేజీలో కొనసాగుతున్న ఈవెనింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఎంబీఏ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఎంబీఏ రెండేళ్ల ఈవెనింగ్ కోర్సుల్లో అక్టోబరు 1న నిర్వహించే ప్రవేశ పరీక్షకు రేపటి (29న) నుంచి సెప్టెంబరు 25 వరకు, రూ.500 అపరాధ రుసుంతో 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. టీఎస్ఐసెట్-2023 అర్హత సాధించిన అభ్యర్థులు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని పూర్తి వివరాలకు www.osmania.ac.in వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా. రూ.23, నల్లవంకాయ 23, పాడుగు వంకాయ 23, బెండకాయ 23, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 26, పందిరి బీర 23, క్యాబేజీ 13, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 45, గోకరకాయ 28, కీర 20, దోసకాయ 21, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 28, ఆలుగడ్డ 21, చామగడ్డ 35, మొరంగడ్డ 35, కందగడ్డ 47, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

సెప్టెంబర్ 18న వినాయక చవితి పర్వదినం

రాంగోపాల్‌పేట్: ఈ ఏడాది శోభకృత్ నామ సంవత్సరంలో వినాయక చవితిని భాద్రపద శుక్ల చతుర్థి అయిన సెప్టెంబర్ 18న జరపాలని నిర్ణయించినట్లు తెలంగాణ విద్వత్సభ అధ్యక్షులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి ఓ ప్రకటనలో తెలిపారు. సిద్ధాంతులు, పంచాంగకర్తలు, జ్యోతిష్య, వేద, శాస్త్ర పండితులు, పురోహితులు, అర్చకులతో ఏర్పడిన ఈ విద్వత్సభ గత ఏడేళ్ల నుంచి ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ పండుగలను నిర్ణయిస్తుందని తెలిపారు. ప్రతి ఏడాది హిందూ పండుగల తేదీల్లో గందరగోళం ఏర్పడుతుండటంతో అందరూ కలిసి చర్చించిన మీదట పండగలను ధర్మశాస్త్రాలకు అనుగుణంగా నిర్ణయించి ప్రభుత్వానికి తెలియజేస్తున్నట్లు తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

సనత్‌నగర్: బేగంపేట రైల్వేస్టేషన్ సమీపంలోని సాయిబాబా, గణపతి దేవాలయ ప్రాంగణంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. బేగంపేట అమెరికన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో మొత్తం 42 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా తొమ్మిది మందికి కాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించామని కాటరాక్ట్ ఎవాల్యుయేషన్ ఉచితంగా అందిస్తామని ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ రామినేటి నరేష్ తెలిపారు.

ముఖ్యమంత్రిని కలిసిన నీరుడు కృష్ణ



బౌద్ధనగర్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సోమ వారం ప్రగతి భవన్ లో దళిత సంఘర్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరుడు కృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలో నిరుపేదలకు డబుల్ బెడ్రూమ్‌లు, దళిత బంధు పథకాలు అందే విధంగా చూడాలని ఎమ్మెల్యే అభ్యర్థుల టికెట్ల కేటాయింపులో బీసీలకు 50 శాతం టికెట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు నీరుడు కృష్ణ తెలిపారు. సీఎం కేసీఆర్‌ను కలిసిన వారిలో మనోజ్, రమేష్, వెంకటేష్, అశోక్ తదితరులు ఉన్నారు.

మున్నూరు కాపులు రాజకీయంగా రాణించాలి



మహిళా నేతలతో కలిసి మాట్లాడుతున్న బండారి లత

లాలాపేట: మున్నూరు కాపులంతా రాజకీయాల్లో రాణించాలని మాజీ కార్పొరేటర్, గ్రేటర్ మున్నూరుకాపు మహిళా సంఘం అధ్యక్షురాలు బండారి లత అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మున్నూరుకాపులకు జనాభాదామాషా ప్రకారం ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మహిళలకు సముచితమైన ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సర్కారు బడులకు మహర్దశ

- మనబస్తీ–మనబడి ద్వారా సనత్‌నగర్ అశోక్‌కాలనీ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- రూ.2 కోట్లు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు
- త్వరలో పనులు ప్రారంభం



అశోక్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాలల భవనం

సనత్‌నగర్: అశోక్‌కాలనీలో ఒకే ప్రాంగణంలో కొనసాగుతున్న నాలుగు పాఠశాలలకు మహర్దశ పట్టనుంది. మన బస్తీ–మన బడి కార్యక్రమం కింద ఆయా పాఠశాలలను ఎంపిక చేసి రూ.2 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో ఇక్కడి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు ఉర్దూ మీడియం పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన జరగనుంది. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులను జారీ చేశారు. వచ్చే నెల నాలుగో తేదీన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఈ పనులను ప్రారంభించనున్నారు.

సమస్యలు తన దృష్టికి వచ్చిందే తడవుగా..

ఈ నెల 5న పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హాజరైన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అన్ని సమస్యలు పరిష్కరిస్తామని, అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చిన రెండు రోజుల అనంతరం ఈ నెల7న విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని ఆహ్వానించారు. నేరుగా విద్యా శాఖ మంత్రి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని మంత్రి శ్రీనివాస్‌యాదవ్ కోరారు. దీనికి మంత్రి సబితాఇంద్రారెడ్డి ఒకే ఆవరణలో ఉన్న ప్రాథ మిక, ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు ఉర్దూ మీడియం పాఠశాలలను మన బస్తీ–మన బడి కార్యక్రమం కింద అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఆ ఆదేశాలలో భాగంగా అధికారులు వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు అనుమతులను మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

వసతుల కల్పనకు పెద్దపీట..

మనబస్తీ–మనబడి కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పాఠశాలలో విద్యుత్ సౌకర్యం, అభివృద్ధి, మరమ్మతులు, పెయింటింగ్ వంటి పనుల కోసం రూ.7.16 లక్షలు వెచ్చించనున్నారు. ఉన్న పాఠశాల భవనం పెయింటింగ్ కోసం రూ.5.16 లక్షలు, తరగతి గదులు, టాయిలెట్స్, విద్యుత్, మంచినీటి సౌకర్యం కోసం రూ.80 లక్షలు, ఉర్దూ మీడియం పాఠశాలలో టాయిలెట్స్ నిర్మాణం, విద్యుత్, మంచినీరు, పెయింటింగ్, మరమ్మతులు ఇతర పనుల కోసం రూ.1.20 కోట్లను మంజూరు చేస్తున్నట్లుగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదే విధంగా ఇదే ప్రాంగణంలోని బీకేగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యుత్, మంచినీరు, మరమ్మతులు తదితర పనుల కోసం రూ.4.80 లక్షలు, ఉన్నత పాఠశాల పెయింటింగ్ కోసం రూ.3.27 లక్షల చొప్పున మంజూరు చేశారు.

జెక్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఉదారత

ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయానికి వాటర్ కూలర్ వితరణ

సనత్‌నగర్: జెక్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు మరోసారి తమ ఉదారతను చాటుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతియేటా ఏదో ఒక సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలోని రోగులు, వారి సహాయకుల కోసం రూ.38 వేల విలువగల వాటర్ కూలర్‌ను కొనుగోలు చేసి సోమవారం సూపరింటెండెంట్ ఉమాశంకర్ సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గంగాధర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాండురంగారావు, నర్సయ్య, వేణుగోపాలరావు, ప్రకాష్‌రావు, సామ్యూల్ పాల్గొన్నారు.



వాటర్ కూలర్‌ను అందజేసిన అసోసియేషన్ ప్రతినిధులు

ఎమ్మెల్యే టికెట్‌కు దరఖాస్తు



గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేస్తున్న నాగిరెడ్డి

సనత్‌నగర్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి తనకు టికెట్ కేటాయించాలంటూ ఆ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఏ–బ్లాక్ అధ్యక్షుడు పి.నాగిరెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో కొన్ని దశాబ్దాలుగా అంకితభావంతో పనిచేశానని తనకు టికెట్ గెలుపొంది తీరుతానని నాగిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న టీటీడీపీ నాయకులు

రసూల్‌పురా: బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని టీటీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముప్పిడి గోపాల్ అన్నారు. బీఆర్ఎస్ పథకాలను పేదలకు అందజేయాలని బీఆర్ఎస్ పార్టీ వైఫల్యాలపై నిరసనగా సికింద్రాబాద్ మండల తహసీల్దార్ పాండునాయక్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదలకు డబుల్ బెడ్రూమ్‌లు, ఖాళీ స్థలాలు ఉన్నవారికి మూడు లక్షల రూపాయలు, దళితబంధు, బీసీ బంధు పథకాలు అర్హులైన వారికి అందజేయడం లేదని ఆరోపించారు. గిరిజనులకు మైనార్టీలకు ఇస్తామన్న రిజర్వేషన్లు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో గౌరిశంకర్, దర్గా రవికుమార్, వేణుగోపాల్ రెడ్డి, సాయి పాల్గొన్నారు.

‘హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం’

బౌద్ధనగర్: హామీల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని టీడీపీ సికింద్రాబాద్ ఇన్‌చార్జ్ వల్లారపు శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు సోమవారం టీడీపీ నాయకులు ముషీరాబాద్ మండల కార్యాలయం ఎదుట నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు పర్చకుండా సీఎం కేసీఆర్ కాలయాపన చేశారన్నారు. మళ్లీ ఎన్నికలు వచ్చే సరికి పలు సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. 22 లక్షలకు పైగా ఇళ్లు లేని పేదవారు ఉంటే, దాదాపు మూడు లక్షల డబుల్ ఇళ్లు నిర్మిస్తామని చెప్పి, కొన్నింటిని నిర్మాణం చేసి పంపిణీ చేయకుండా వదిలేశారని వెంటనే ఇళ్ల పంపిణీ చేయాలన్నారు. ఈ నిరసనలో ప్రవీణ్ కుమార్, విజయ్‌కుమార్, వినోద్, పొట్టి శ్రీను, వెంకటస్వామి, చిరంజీవి, శశిరేఖ, చందర్, చంద్రమోహన్, మల్లేష్ యాదవ్, మురళి పాల్గొన్నారు.

ఘనంగా వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

బౌద్ధనగర్: వికలాంగుల హక్కుల పోరాట సమితి 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సమితి అధ్యక్షురాలు ఎరుపల్లి మంగమ్మ వీహెచ్‌పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ షన్ముఖ రావు, జిల్లా ఇన్‌చార్జ్ మందకుమార్ మాట్లాడుతూ.. వికలాంగుల హక్కుల కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పోరాటం చేయడం జరుగుతుందని వికలాంగుల పింఛన్‌ను రూ. 6 వేలకు పెంచి విద్యా ఉద్యోగ సంక్షేమ రాజకీయ రంగాల్లో 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మంథని సామ్యూల్, ఇనుముల నర్సయ్య, వినయ్, సత్యనారాయణ, బండారులక్ష్మి, మీసాల లక్ష్మి పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

ప్రత్యేక ప్రార్థనలు



సికింద్రాబాద్: సికింద్రాబాద్ కాంగ్రెస్ టికెట్ దీపక్ జాన్‌కు దక్కాలని కోరుతూ కాంగ్రెస్ నేతలు మెట్టుగూడ చర్చిలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గత పదేళ్ల నుంచి నియోజకవర్గంలో దీపక్ జాన్ అనేక ప్రజాహిత కార్యక్రమాలు, ప్రజలతో మమేకమైన తీరును కాంగ్రెస్ అధిష్ఠానం పరిగణలోకి తీసుకొని రాబోయే ఎన్నికల్లో సికింద్రాబాద్ అభ్యర్థిగా దీపక్ జాన్‌ను ప్రకటించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రార్థనల్లో కాబ్రల్, ఆంథోని, అరుణ్, శ్రీధర్‌రెడ్డి, లారెన్స్, హ్యారీ, రోనాల్డ్ పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యా రంగానికి కేంద్రం 10, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులు కేటాయించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సోమవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా విద్యలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచే లక్ష్యంతో ఇండియా మార్చ్ ఫర్ సైన్స్-2023 పేరుతో ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ నుంచి ఆంధ్రమహిళా సభ విద్యా సంస్థల వరకు ర్యాలీ నిర్వహించారు. నగరంలోని వివిధ కాలేజీ విద్యార్థులు హాజరుకాగా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు డాక్టర్ వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షులు ప్రొ.బీఎన్ రెడ్డి, బ్రేక్ త్రూ సైన్స్ సొసైటీ ప్రతినిధి గంగాధర్, ఎన్ఐఎన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ మహతాబ్ బామ్జి, డాక్టర్ ప్రమీల, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.



గోమయ రాఖీలు !

కాచిగూడ: గోమయంతో తయారుచేసిన రాఖీలు పర్యావరణానికి హితమైనవని, గోమయ రాఖీలనే అందరూ ఉపయోగించాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ తెలిపారు. సోమవారం కాచిగూడలోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈసారి వందశాతం ఆవు గోమయంతో తయారు చేసిన రాఖీలతో రాఖీ పండుగను నిర్వహించుకోవాలన్నారు. గోమయ రాఖీలు పూర్తిగా ఆవుపేడతో తయారు చేయబడినవని, నేలపై పడితే సేంద్రియ ఎరువుగా, నీటిలో వేస్తే కరిగిపోయి ఆక్సిజన్‌ను పెంచి మనిషికి ఆరోగ్యాన్ని ఇస్తుందన్నారు. సమాజంలో సోదరిమణులందరూ.. రక్షాబంధన్ సందర్భంగా ఆవు పేడతో తయారు చేసిన రాఖీలను కట్టడానికి ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. కావాల్సిన వారు కాచిగూడ గోశాల ఫెడరేషన్ కార్యాలయం లేదా సెల్ 9394005600.

నకిలీ వెబ్‌సైట్ సృష్టించి.. రూ.కోటికి పైగా దోచేసి

- కంటైనర్లపై పెట్టుబడి పేరిట ఘరానా మోసం
- సీసీఎస్ పోలీసులకు ఆశ్రయించిన బాధితులు



సిద్ధార్థ్

అమీర్‌పేట: కంటైనర్లపై పెట్టుబడి పెట్టండి.. అధిక ఆదాయం పొందండి. మీకు తెలిసిన వ్యక్తులతో పెట్టుబడి పెట్టించి మీ ఆదాయాన్ని రెట్టింపు చేసుకోండి అంటూ అనేక మందితో పెట్టుబడులు పెట్టించి కనిపించకుండా పోయాడో ఘరానా మోసగాడు. ప్రస్తుతం 17 మంది సుమారు రూ.1.05 కోట్ల మేర మోసపోయామని సీసీఎస్ పోలీసులను ఆశ్రయించారు. ప్రపంచ వ్యాప్తంగా అధిక సంఖ్యలో ఓడలు, కంటైనర్ల ద్వారా సరుకు రవాణా చేసే అంతర్జాతీయ సంస్థ అయిన మెర్సర్స్ పేరుతో నగరంలోని హైదర్‌గూడ అత్తాపూర్‌లో ఉండే ధార్మిక్ చాట్ల సిద్ధార్థ్ నకిలీ వెబ్‌సైట్ సృష్టించాడు. కంటైనర్లు కొనుగోలు, లేదా అద్దె రూపంలో కంటైనర్లు తీసుకోవడం కోసం పెట్టుబడి పెడితే ప్రతి రోజు అధిక ఆదాయం వస్తోందని పలువురిని నమ్మించి యూపీఐ ఐడీల ద్వారా పెట్టుబడులు స్వీకరించాడు. మొదట్లో కొంత ఆదా యం వారి ఖాతాల్లో వేస్తుండటంతో చాలా మంది ఆకర్షితులయ్యారు. ఇలా పెట్టుబడులు పెట్టిన వారితో గ్రూపు తయారు చేశాడు. సభ్యుల ఖాతాల్లో రూ.వేలల్లో డబ్బులు వేస్తూ చాలా మంది ఇందులో చేర్పించారు. అతడు సృష్టించిన ఓ వెబ్‌సైట్ ద్వారా ఖాతాల్లోకి ఒకటి రెండు సార్లు డబ్బులు వేయడంతో అతడిని పూర్తిగా నమ్మి అనేక మంది లక్షల్లో పెట్టుబడులు పెట్టారు. డబ్బులు విత్ డ్రా చేసుకునేందుకు ప్రయత్నిస్తుండగా రిజెక్ట్ అని వస్తుందని బాధితులు తెలిపారు. ఆగష్టు 18 వరకు పనిచేసిన వెబ్‌సైట్ మూత పడిపోయింది. దీంతో కొందరు సభ్యులు అత్తాపూర్‌లోని సిద్ధార్థ్ ఇంటికి వెళ్లి చూడగా తాళం వేసి ఉంది. ఫోన్ కూడా స్విచ్చాఫ్ చేసి ఉండడం, కారు కూడా లేక పోవడంతో కుటుంబ సభ్యులతో కలిసి పారిపోయి ఉంటాడని గ్రహించిన బాధితులు చివరకు పోలీసులను ఆశ్రయించారు.17 మంది బాధితులు ఒకొక్కరు సుమారు రూ.3 లక్షల నుండి 10 లక్షల వరకు పెట్టుబడులు పెట్టినట్లు తెలిపారు. బాధితులు మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలిసింది.

తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తా

మంత్రి తలసాని

రాంగోపాల్‌పేట్: చుట్టలబస్తీలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. సోమవారం వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని చుట్టలబస్తీలో పర్యటించగా బస్తీలో తాగునీటి సరఫరా సక్రమంగా జరుగడం లేదని ఈ సందర్భంగా స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వారం రోజుల్లో అదనపు పైప్‌లైన్ నిర్మాణ పనులు జరిగేలా చూడాలని, బస్తీలోని మురుగు నీటి సమస్య పరిష్కారం కోసం పూర్తి స్థాయిలో డీ-సిల్టింగ్ చేయించాలని అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని అలాగే వీధి దీపాలు ఎక్కడెక్కడ వెలగడం లేదో పరిశీలించి మరమ్మతులు అవసరం ఉన్న చోట కొత్తవాటిని ఏర్పాటు చేయాలన్నారు. నాలాలో చెత్త వేయవద్దని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తెలి అరుణగౌడ్, జోనల్ కమిషనర్ రవికిరణ్, ఆర్డీవో రవి, ఉప కమిషనర్ శంకర్, ఈఈ సుదర్శన్, ఏసీపీ కిష్టఫర్, ఎలక్ట్రికల్ ఏడీఈ కృష్ణ, జలమండలి జీఎం సురేష్ పాల్గొన్నారు.



బస్తీవాసులతో మాట్లాడుతున్న మంత్రి తలసాని

ఆర్థికసాయం చెక్కు అందజేత..

సనత్‌నగర్: భారీ వర్షాలతో ఇల్లు కూలి నష్టపోయిన బాధిత కుటుంబానికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సనత్ నగర్ డివిజన్ అల్లావుద్దీన్ కోఠిలోని షబానాబేగంకు చెందిన ఇల్లు జులై నెలలో కురిసిన వర్షాల ధాటికి కూలిపోయింది. ప్రకృతి వైపరీత్యాల కింద నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం కింద మంజూరైన రూ.99 వేల చెక్కును సోమవారం మంత్రి అందజేశారు.



చెక్కు అందజేస్తున్న మంత్రి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న బండ కార్తీకరెడ్డి

పక్కా రోడ్డుకు మోక్షం

లాలాపేట: దాదాపు 20- 25 ఏళ్ల నుంచి పెండింగ్‌లో సత్యానగర్‌కు వెళ్లే మట్టి రోడ్డులో ఎట్టకేలకు పక్కా రోడ్డు నిర్మాణానికి మోక్షం లభించింది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహకారంతో సోమవారం అధికారులు పనులను చేపట్టారు. మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి స్థానిక కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్తీకరెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఈ ప్రాంతంలో కిషన్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్న సమయంలో స్థానిక కాలనీవాసులు రోడ్డు నిర్మాణం సమస్యను కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారని ఆనాడు రోడ్డు నిర్మాణం కోసం ఇచ్చిన హామీ మేరకు రైల్వే అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణం చేసేలా కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు.

‘సాక్షి’కి కృతజ్ఞతలు

సత్యానగర్ మట్టి రోడ్డుతో స్థానిక కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై పలుమార్లు ‘సాక్షి’ ప్రచురితమైన కథనాలకు కేంద్ర మంత్రి, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేస్తున్నారని ఇందిరానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు నేతికార్ మహేశ్ తెలిపారు. చాలా కాలం అపరిష్కృతంగా ఉన్న రోడ్డు సమస్య పరిష్కారానికి ఇటీవల ‘పక్కా రోడ్డు నిర్మాణం చేపట్టాలి’ అనే శీర్షికతో పాటు వరుస కథనాలతో కృషి చేసిన సాక్షి దినపత్రికకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతీ గడపకూ సంక్షేమ పథకాన్ని చేర్చిన ఘనత కేసీఆర్‌దే




బీసీ బంధు పత్రాన్ని అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులను మెరుగుపర్చడం ద్వారానే వారి స్వావలంబన సాధ్యపడుతుందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం బీసీ బంధు పథకాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీసీ కులాలకు చెందిన వారికి ఆర్థికంగా ఉపకరించి, స్వయం ఉపాధిని కల్పించేందుకు వీలుగా రూ. లక్ష మేరకు ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నామన్నారు. ఈ పథకంలో డబ్బులు పొందేందుకు ఎవ్వరికీ లంచాలు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గృహలక్ష్మి పథకంలో భాగంగా సొంత స్థలం ఉండి, పక్కా ఇళ్లను కట్టుకోలేని నిరుపేదలకు రూ. 3 లక్షల మేరకు ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నామన్నారు. ప్రతీ ఇంటికి వివిధ సంక్షేమ పథకాలను చేర్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, సునీత, ప్రసన్నలక్ష్మి, ఆర్డీఓ రవికుమార్, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఆశన్న, అధికారులు శ్రీనాథ్, శివకుమార్, బీఆర్ఎస్ నేతలు కిషోర్‌గౌడ్, రామేశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ పవిత్రోత్సవాలు

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. పద్మావతి గోదా సమేత ప్రసన్న వెంకన్నస్వామి ఉత్సవ మూర్తులకు పట్టువస్త్రాలతో అలంకరించి ద్వాదశరాధన, పవిత్ర సమర్పణ, నిత్యహోమం, అర్చనలు నిర్వహించారు. ఈ నెల 29వ తేదీ ఉదయం 9 గంటలకు 108 కలశాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావు, ఈఓ రాజేష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బాలభాస్కర్, ఆత్మారామసూర్య సుబ్రహ్మణ్యం, శివ శంకరన్, నారాయణన్, సుజయ్‌ప్రకాశ్, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.



న్యూసెన్స్ కేసులో విద్యార్థులకు జైలు

ముషీరాబాద్: మాదక ద్రవ్యాలు సేవిస్తూ రోడ్లపై న్యూసెన్స్ చేయడమేగాక పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఐదుగురు విద్యార్థులు, ఇద్దరు విద్యార్థినులను ముషీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విద్యానగర్, రాంనగర్, తిలక్‌నగర్, డీడీ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉంటున్న 8 మంది విద్యార్థులు దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ కాలనీలోని ప్రభుత్వ హోటల్ మెనేజ్‌మెంట్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. ఆదివారం వారు ఇద్దరు విద్యార్థినులతో సహా రాంనగర్‌లో ఉంటున్న రాహుల్ గదికి వచ్చారు. అనంతరం అందరూ కలిసి మాదకద్రవ్యాలు సేవించారు. అనంతరం రోడ్డుపైకి వచ్చి న్యూసెన్స్ చేస్తుండడంతో స్థానికులు ముషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై స్వప్న సిబ్బందితో అక్కడికి రాగా వారిపై దురుసుగా ప్రవర్తించడమేగాక విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పీటీ కేసు నమోదు చేసి సోమవారం 5వ ఎంఎం స్పెషల్ మార్నింగ్ కోర్టు జడ్జి లక్ష్మణ్‌రావు ఎదుట హాజరుపరిచారు. మాదక ద్రవ్యాలకు బానిసైన రాహుల్‌ను సికింద్రాబాద్‌లోని రిహ్యాబిలిటేషన్ సెంటర్‌కు తరలించి మిగతా ఐదుగురు విద్యార్థులకు రెండు రోజుల జైలు శిక్ష, ఇద్దరు విద్యార్థినుకు ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.